క్లుప్తంగా

పరామర్శ



షఫీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణ కమిటీ సభ్యుడు బాబాజాన్ అల్లుడు షఫీవుల్లా రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక బుధవారం షఫీ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని.. అధైర్యపడవద్దని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో 5వ వార్డు ఇన్‌చార్జ్ అసిఫ్ ఖాన్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవితారెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ అయూబ్ బేగ్, సహారా భాను, శ్రీనాథ్, వరుణ్‌రెడ్డి, ఇనాయత్, సాధిక్, నాసిర్, జమీర్, మజీద్, నయాజ్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి



సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని హిందూపురం యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ నుంచి ఏడుగురు క్రీడాకారులు శ్రీ సత్యసాయి జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టుకు ఎంపికైనట్లు ఆ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ మహమ్మద్ సలీమ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని క్రీడామైదానంలో ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 11న మదనపల్లిలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గత సంవత్సరం ఇదే కేటగిరీలో జీవీ వైద్విత హరిణి క్లబ్ నుంచి రాష్ట్ర జట్టుకి ప్రాతినిథ్యం వహించిందని గుర్తు చేశారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకోవాలని సూచించారు.

ఆలయానికి విరాళం



ఈఓకు చెక్కు అందజేస్తున్న అన్నదాన కమిటీ సభ్యులు

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయంలో ధూప, దీప నైవేద్యం నిర్వహించడం కోసం బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) నరసింహమూర్తికి రూ.2 లక్షల చెక్కును అన్నదాన కమిటీ సభ్యులు అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో ఉత్సవాల నిర్వహణకు రూ.3 లక్షలు చెల్లిస్తామని అన్నదాన కమిటీ సభ్యులు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శివపార్వతుల పూలపల్లకీ ఉత్సవాలకు రూ.లక్ష, ధూప, దీప నైవేద్యం కోసం రూ.2 లక్షలు అందజేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేవాలయ పూజలకు సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సామగ్రి వితరణ



విశ్రాంత ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఎస్.నరసింహస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశ్రాంత ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఎస్.నరసింహస్వామి బుధవారం రూ.3 లక్షల విలువ చేసే సామగ్రి (కుర్చీలు, ఫర్నిచర్) అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సహకారం అందించాలని బెంగళూరుకు చెందిన ట్రాన్ జాక్షన్ ఎలా లిస్ట్ కంపెనీ, పెనుకొండ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి కోరడంతో విశ్రాంత ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఎస్.నరసింహస్వామి కుర్చీలు, ఫర్నిచర్ అందజేయడం హర్షణీయమన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఎస్.నరసింహస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బయ్య, హిందూపురం మహిళా డిగ్రీ కళాశాల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14న మండల సమావేశం

సోమందేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. మండలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్డుపై వెళ్లేదెలా?

అమరాపురం మండలం గౌడనకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు నీటిలోనే రావాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కర్ణాటక రాష్ట్రం కొడిగేహళ్లి, మరిదాసనహళ్లి, రంగసముద్రం, లింగహల్లి తదితర ప్రాంతాల వారు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోకి మట్టిని తరలించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– అమరాపురం:



రొద్దం హౌసింగ్ కాలనీలో కంపచెట్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

పొంచి ఉన్న ప్రమాదం

రొద్దం మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కంపచెట్లకు తగిలే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఓ సెల్ టవర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు కనీసం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగలు మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– రొద్దం:



మురుగు నీటిలో పేరుకు పోయిన చెత్త

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

పావగడ తాలూకాలోని వళ్లూరు గ్రామ పంచాయతీ క్యాతగానచెర్లు గ్రామంలో ఆసియా ఖండంలోనే అతి పెద్ద సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటైంది. సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో గ్రామానికి పేరు వచ్చినా.. చెత్తతో ఊరు దిబ్బలా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జనావాసాల మధ్య గుంతల్లో వర్షపు చేరుతోంది. చెత్తాచెదారంతో భారీగా పేరుకు పోవడంతో దుర్వాసన వస్తుండటంతో ఇళ్లలో ఉండలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సీఎస్ఆర్ నిధులతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని మండిపడుతున్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, చరండి, శౌచాలయాలు, సముదాయ భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– పావగడ:

ప్రభుత్వ తీరును ఎండగడదాం



మాట్లాడుతున్న హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి

గుడిబండ: కూటమి ప్రభుత్వ తీరును ఎండగడదామని హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శంకరగల్లు, రాళ్లపల్లి గ్రామంలో సమన్వయకర్త ఈరలక్కప్ప అధ్యక్షతన బుధవారం వైఎస్సార్‌సీపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలు ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీ పార్టీకి ఏమీ కాదన్నారు. నూతన గ్రామ కమిటీల ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్తేజం రావాలన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామని సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. ఏడాదంతా సీఎం చంద్రబాబు ప్రజలను వెన్నుపోటు పొడుస్తూ పాలన సాగించారని మండిపడ్డారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ విమర్శించారు. బాబు మోసాలను క్యూర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు బంగారు భవిష్యత్తు ఇచ్చిందని మాజీ మంత్రి నర్సేగౌడు అన్నారు. చంద్రబాబు విధ్వంసకర పాలన సాగిస్తున్నారన్నారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేయడమే ఆయన నైజం అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి, రాష్ట్ర జాయంట్ సెక్రటరీ భారతి రెడ్డి, మహిళా విభాగం సెక్రటరీ సాయిలీల, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మధులత రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ రంగేగౌడు, జెడ్పీటీసీలు అనంరాజు, భూతరాజు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అశ్వద్ నారాయణ, మాజీ వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, ఎంపీటీసీ పుష్పలత నాగేంద్ర, గుడిబండ సర్పంచ్ కరుణాకర్ గౌడ్, నియోజకవర్గ భూత్ కమిటీ కన్వీనర్ మల్లికార్జున, పబ్లిసిటీ వింగ్ సికిందర్, వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మునిమడుగులో, 11 గంటలకు గుట్టూరులో జరిగే కార్యక్రమాలకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మెగా పేరెంట్స్ మీటింగ్

రొళ్ల: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణలో స్కూల్ కమిటీ సభ్యులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా నిర్వహించాలన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



రొద్దంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రొద్దం: మండల పరిధిలోని కలిపి, పెద్దమంతూరు, చెరుకూరు గ్రామ పంచాయతీల్లో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటి క్యూర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబును నమ్మి ఓటు వేసిన అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని నాయకులు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు ఎస్.నారాయణరెడ్డి, బూదిపల్లి రాము, లక్ష్మీనారాయణరెడ్డి, సి.నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, నరేంద్ర రెడ్డి, తిమ్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం



హిందూపురం టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు



అమరాపురంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పరిగిలో నినాదాలు చేస్తున్న దృశ్యం

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించారు. మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేసి, రాస్తారోకో చేపట్టారు. కార్మిక హక్కులను కాలరాస్తూ పనిగంటలు పెంచుతూ పారిశ్రామిక వేత్తలకు బసటగా ప్రవేశపెడుతున్న కొత్త లెబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వేతనాల బోర్డ్ ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు పాటుపడాలని కోరారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్టీసీ కార్మికులు, ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఎం నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్:

ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక దాడులు



స్వాధీనం చేస్తుకున్న కల్తీ కల్లును చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పట్టణ పరిధిలోని మేళాపురం క్రాస్‌లో దాసరి భరత్ కుమార్ అనే వ్యక్తి నుంచి బెంగళూరు విస్కీ 180 ఎంఎల్ 60 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే లేపాక్షి మండలంలో గంగప్ప అనే వ్యక్తి కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అతడి నుంచి ఆరు లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చంద్ర శేఖర్ అనే వ్యక్తి నుంచి 10 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశామన్నారు. కాగా కల్తీ కల్లు కలిగి ఉన్నా, విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టుబడిన కర్ణాటక మద్యం, 65 కేసుల్లో సీజ్ చేసిన మద్యాన్ని శ్రీసత్యసాయి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ గోవిందనాయక్, ఏఎస్ఐ రామంజనేయులు సమక్షంలో బుధశారం ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. 2,586 కర్ణాటక మద్యం ప్లాస్టిక్ ప్యాకెట్లు, బీర్ బాటిళ్లను ధ్వంసం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆంధ్ర రైతులకు సాయం చేయండి



సింగిల్ విండో అధ్యక్షుడు గోవిందరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొద్దం: కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్ర రైతులకు సాయం చేయాలని కర్ణాటక గుట్టు కోడిగెనహళ్లి సింగివిండో అధ్యక్షుడు, వైఎస్సార్ అభిమాని పోలేపల్లి గోవిందరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం కొడిగెనహళ్లిలో ఆయన్ను కలసి శాలువాలతో సత్కరించారు. కర్ణాటక సరిహద్దులో ఆంధ్ర రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఉన్నందున కర్ణాటక ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని సూచించారు. రైతుల తరఫున నిలబడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారుతిరెడ్డి, కలిపి శ్రీనివాసులు, రాజారెడ్డి, రాజ్‌గోపాల్ రెడ్డి, పరిగి మండల నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



మాజీ మంత్రి వెంకటరమణప్పను ఓటు అడుగుతున్న అభ్యర్థులు

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. మొత్తం 15 డైరెక్టర్ల స్థానాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడానికి 15 మంది అభ్యర్థులు సిండికేట్ గా ఏర్పాటై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మిగిలిన 11 మంది స్వతంత్రంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బుధవారం సిండికేట్ అభ్యర్థులు స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్పను కలసి ఓట్లు అభ్యర్థించారు.

శ్రీధర్‌కు డాక్టరేట్



గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న శ్రీధర్

పావగడ: తాలూకాలోని రాయచెర్లు గ్రామానికి చెందిన వెంకటేశ్, అలివేలమ్మ దంపతుల కుమారుడు ఆర్.వి శ్రీధర్ తుమకూరు విశ్వ విద్యాలయంలో జరిగిన 18వ స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. అంతేకాకుండా 2020 సంవత్సరంలో జరిగిన 13వ స్నాతకోత్సవంలో స్వర్ణ పతకం సాధించాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తల్లిదండ్రులు కుమారుడు పీహెచ్‌డీ పట్టా అందుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన శ్రీధర్‌ను ఉప కులపతి ఎం.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు ఎం.కొట్రేశ్ తదితరులు అభినందించారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు గోపూజ అనంతరం మహిళలు సాయి సత్య వ్రతం ఆచరించారు. అలాగే ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన దుద్దేబండ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కియా ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. చంద్రగిరి గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ (25) పెనుకొండ పట్టణంలో నివాసం ఉంటూ కియా పరిశ్రమలో పని చేసేవాడు. బుధవారం గ్రామంలో వ్యక్తిగత పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో పెనుకొండకు బయలుదేరాడు. మార్గం మధ్యలో నేషనల్ కంపెనీ ఎదరుగా కంటైనర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఫక్రుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధిక రసాయనాల వినియోగంతో అనర్థాలు

అగళి:/మడకశిరరూరల్/గుడిబండ: పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించవద్దు. నూతన యాజమన్య పద్ధతులు పాటించడం అలవాటు చేసుకోవాలని ఏఓలు నాగరాజు, తిమ్మప్ప, వీర నరేష్ సూచించారు. బుధవారం అగళి, మడకశిర, గుడిబండ మండలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. విత్తన శుద్ధి చేస్తే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు.

అమరాపురం/సోమందేపల్లి: పంటల బీమాకు నమోదు చేసుకోవాలని ఏఓలు మంజునాథ, విజయ భారతి పేర్కొన్నారు. జిల్లాలో వాతావరణ ఆధారిత బీమా అమలులో ఉందని తెలిపారు. వేరుశనగ, పత్తి, దానిమ్మ, టమాట, చీనీ పంటలకు ఈనెల 15వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.